
కథ

# ఆనంద పురం వెళ్ళాలి

ఆదూరి వెంకట సీతారామ మూర్తి



**ఎండ!**

**ఎండాకాలపు మిట్ట మధ్యాహ్నపుటెండ. కాకులు కూడా బయటకు రావడానికి భయపడి చెట్ల కొమ్మల్లో తలలు దించుకునేటంత ఎండ!**

గేటు గడియ కొట్టిన శబ్దం. ఆ వెంటే 'అమ్మా' అన్న పిలుపు!

అది పిలుపు కాదు- ఆర్తనాదంలాంటి అరుపు! ఆ అరుపుకు బెడ్రూముల్లో నడుం వాల్చినవాళ్లూ ముందుగదిలో టీవీలు చూస్తున్నవాళ్లు ఉలిక్కిపడాల్సిందే- పడ్డారు కూడా! అయినా మనని కానట్లు వూరుకున్నారు.

మళ్లీ అదే పిలుపు- రెండో మారూ, మూడో మారూ కూడా!

వీధి తలుపు సగం తెరిచి "ఏఁవిటి?" అంది శృతి.

"అమ్మగారు లేరా?" అడిగేడు వాడు.

"ఎందుకూ?"

"సీపిర్లండి. మంచిగున్నయి." అన్నాడు వాడు.

"అక్కర్లేదు. ఉన్నాయి" అంది శృతి.

"మంచి సీపిర్లండి- పెద్ద కట్టలు- చవగ్గా యిచ్చేస్తాను" అన్నాడు వాడు.

"అక్కర్లేదని చెప్పేనా. పడుకున్నారు. గోలచెయ్యక వెళ్లు" విసుక్కుంది.

"అమ్మగారెప్పుడూ నాకాడే కొంటారు- మంచివున్నప్పుడు తెమ్మంటారు చవగ్గా యిచ్చేస్తానని చెప్పండి" బతిమాలే ధోరణి!

తలుపు ఓరగా వేసిందేమో వాడిమాటలు విన్పిస్తున్నాయి నిద్రకోసం బెడ్రూములో విశ్రాంతి తీసుకుంటున్న వసుంధరకి.

లోపలికొచ్చి టీవీ సౌండు కాస్త పెంచి సోఫాలో కూలబడింది శృతి.

'అమ్మా' అంటూ మరో కేకవేశాడు వాడు. వాడి కేకలో అభ్యర్థన.

"ఏఁవిటీ ఈ వేళప్పుడు వచ్చి కేకలూ" తలుపు తెరుచుకుంది.

"సీపిర్లమ్మా. పెద్ద పెద్దవి మంచి కట్టలున్నాయి."

"ఉన్నాయి. ఒద్దు. ఈ మారొచ్చినప్పుడు కనబడు."

"పొద్దుట్నుంచీ తిరుగుతున్నానమ్మా. బోణీ లేదు. చవగ్గా యిస్తాను."

వాడు గేటు పట్టుకుని కదల్లేదు.

కావి రంగు పొట్టిపంచ; పైన జుబ్బా తలకో మాసిన తువ్వాలు, తలమీద చీపుళ్ల మోపూ దేశంలోని పేదరికమంతా వాడిలోనే వున్నట్లుంది.

"ఎంతకిస్తున్నావ్?"

వాడు నవ్వేడు. "తీసుకోండమ్మా. మీకు తెల్దేటి?" గేటు తీసుకొచ్చేడు అనుమతి దొరికినట్టు.

"నాకు తెలీదు చెప్పు."

"మీకాడ బేరమెందుకమ్మా. కొండ సీపిరి ఇరవై. కొబ్బరి సీపిరి పదీ."

"అలా రెట్టింపు ధరలు చెబితే ఎలా తీసుకుంటాం. అక్కర్లేదు వెళ్లు" అంది వసుంధర.

"అలాగ చెస్తే ఎలాగమ్మా. అది పదేనూ యిది ఎనిమిదీ, యిచ్చేయండి. ఇవెమూడూ అవో నాలుగు వున్నాయి." అన్నాడు వాడు నెత్తిమీదివి కిందికి దింపి కూర్చుంటూ.

"కొత్తిమీరి కట్టల్లా చిన్న చిన్నవి కట్టేవు. పైగా ఎండ వేళొచ్చి బేరాలు! కొండ చీపురు పన్నెండుకీ కొబ్బరి చీపురు ఐదుకు యిస్తే అదొకటీ ఇదొకటీ యివ్వు. లేదా పట్టుకుపో" అంది.

వాడు మరొక్క క్షణం మౌనంగా వుండిపోయి- 'దయగల తల్లులు. మా కష్టంకూడ చూడాల. బస్ చార్జీకూడా రాకపోతే మావెఁలా బతకాల తల్లీ."

"కిడితేనే ఇయ్యి. లేదా పట్టుకుపో" వెనుదిరిగింది వసుంధర.

"తియ్యండమ్మా. కొబ్బరి చీపుళ్లు నాలుగు తీసుకోండి. పొడావు కట్టలు." అంటూ అక్కడ పెట్టేడు.

"అదొకటీ ఇదొకటీ చాలు. అలా వెళ్లి పెరట్లో పెట్టిరా" అంది ముక్తసరిగా.

అయిష్టంగానే వాడు రెండు కట్టలూ తీసుకొని పెరట్లో పెట్టి వచ్చేడు. ఆమె ఇచ్చిన డబ్బులందుకుని కళ్లకద్దుకుని చిక్కంలో పెట్టుకున్నాడు.

"ఈ సీపిర్లు గూడ ప్లాస్టిక్కువి వచ్చేస్తున్నాయట. మాలాటోళ్లెలా బతకాలో మరి!" అంటున్నాడు వాడు మిగిలిన చీపుర్లని కట్టకడుతూ.

నిజమే- వీళ్లకీ అన్నీ తెలుస్తున్నాయి. కానీ ఏం చేస్తారు? ఈ కొండ చీపురే డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో అయితే పెద్ద కవర్లో పెట్టి టేగుకట్టి పాతిక్కి అమ్ముతున్నారు! వాడు వీధిగేటు వేసి వెళ్తే తలుపేసుకు లోపలికి వెళ్లాలనుకుంటోంది.

"అమ్మగోరూ. ఆకలేస్తంది. కాసింత గంజేనా, వణ్ణమేనా ఎట్టండమ్మా." అంటున్నాడు వాడు. కడుపులోని మంట కళ్లలోంచి జాలిగా ఎగుస్తోంది-

"ఈ వేళప్పుడొచ్చి ఇదొకటా? అయినా ఈ రోజుల్లో పట్నాల్లో గంజెవరు వారుస్తున్నారు."

"పొద్దుటికాణ్ణించి ఏటీ తిన్నేదమ్మా. దానికి సాయం ఎండొకటీ."

"ఎక్కడినించొస్తావ్" అడిగింది

"అదెక్కడ... మావూరు ఆనందపురం. బస్సు టికటే ఎనిమిదీ " అన్నాడు వాడు.

రానూ పోనూ పదహార్రూపాయలా! ఈ చీపుర్లు రోజంతా ఎండనబడి అమ్మితే ఎంతొస్తుంది? బస్ ఛార్జీపోనూ ఇంటికెంత పట్టుకెళ్తాడు?

మరో ప్రశ్నవేస్తే వాడీ లెక్కలన్నీ చెప్పుకొచ్చేలా వున్నాడు.

పనిమనిషికోసం వుంచిన అన్నం, పులుసు ఆకులో వేసి ఇచ్చింది. పంపుదగ్గర చేతులు కడుక్కుని అరక్షణంలో ఆవురావురని తిన్నాడు. ఆకు అవతల పారేసి చెంబుతో చెంబుడునీళ్లు గటగటా తాగేసి 'మరికాసిన్ని నీళ్లమ్మా' అన్నాడు.

నీళ్లు!... తాగేందుకు నీళ్లు అమ్ముకునే వాళ్లందరికీ ఈ మంచినీళ్ల సమస్యే. టైలు కట్టుకొచ్చి కత్తుల్నీ డోర్‌మేట్లనీ వంట సామానుల్నీ అమ్మే సేల్స్ మేనేజర్స్‌కీ నీళ్లు, అప్పడాలూ, సర్ఫ్ పేకెట్లూ, అగరుబత్తీలూ అమ్మే రంగురంగుల కంపెనీ డ్రస్సుల అమ్మాయిలకీ నీళ్లే! పూర్వం వీధి కుళాయిలుండేవి. నూతులుండేవి. ఇప్పుడో.. రెండు గుక్కల నీటి పొట్లాం రూపాయి! గోలీ షోడా ఎక్కడో గాని కన్పించడమే లేదు.

'చల్లని తల్లి! ఎల్తానమ్మా' అన్నం తిన్న కృతజ్ఞత వాడి కళ్లలో.

'గేటు గడియవేసి వెళ్లు.'

"అలాగేనమ్మా."

గేటు వేసేడుగానీ అక్కడ్నుంచీ కదల్లేదు వాడు. పక్కనే రోడ్డు మీదున్న కాగుచెట్టు వైపే వుంది వాడి దృష్టి. తలుపు జారేస్తూ చూసింది వాడివైపు. చిన్నగా విస్తరించిన కాగుచెట్టు నీడలోకి జరిగి . విశ్రమించాడు. ఇంతటి పట్నంలో కూడా మున్సిపాలిటీవారు చేసిన మంచిపని ఇదొకటి! అమ్ముకునే వాళ్లకీ; అడుక్కుతినే వాళ్లకీ, సేల్స్ రిప్రజెంటేటివ్‌లకూ, బాటసార్లకీ ఆ కాగుచెట్టే ఎ.సి.గది!

***

ఎండతాపంవల్ల కలిగిన అలసటచేత మంచంమీద వాలేసరికి వసుంధరికి మాగన్ను పట్టేసింది. గోడగడియాం మూడు గంటలూ కొట్టి టీకీ టైమైందని హెచ్చరించింది. టీ పెట్టి నలుగురికీ ఇచ్చి తనూ కప్పులో పోసుకొని తాగుతూ వీధి తలుపుతీసింది.

అప్పుడే గేటు దగ్గర వాడు! 'అమ్మా' అంటూ-

"కొన్నానుగా. మళ్లీ ఎందుకొచ్చావ్" అడిగింది మాటలో కాస్తంత చిరాకును ప్రదర్శిస్తూ.

"ఏట్నేదమ్మా. ఎల్తానని చెబుదామనీ... చల్లని తల్లి" అన్నాడు.

వాడి కళ్లలో కృతజ్ఞత- మనసులోంచి దీవింపు

"అలాగే వెళ్లు." అనబోయి "ఇదిగో యిలారా" అంది.

అడుగు ముందుకు వేయబోయిన వాడల్లా ఆగి గేటు దగ్గరకొచ్చి "ఏటమ్మా" అన్నాడు-

"నిలబడు" అంటూ లోపలికి వెళ్లి క్రితంరోజు గుళ్లో కొట్టిన కొబ్బరికాయలు తాలూకూ రెండు కొబ్బరిచెక్కలూ, నాలుగు అరటిపళ్లూ తెచ్చి వాడికందిస్తూ "ప్రసాదం పిల్లలకి పెట్టు" అంది. వాడు సంతోషంగానే అందుకొని తలూపేడు.


"ఎంతమంది పిల్లలు" వెనుదిరుగుతూనే అక్కర్లేని ప్రశ్నవేసింది.

"ఇద్దరమ్మా. ఆడగుంటలు మా ఆడదాయిని పన్లోకి పోనియ్యరు" అన్నాడు.

"ఏం పని చేస్తుందేం మీ ఆవిడ."

"పాచిపన్లే- రెండిళ్లు చేస్తాది- అయితే ఏట్నాబం. నెలబత్తెం నాల్రోజులన్నా సరిపోదు" అంటూ వెనుదిరిగాడు-

సాయంకాలం బజార్లోకి వెళ్లి తిరిగొస్తూ సాయిగోపాల్ సినిమాహాలు దగ్గర ఆటో ఎక్కబోతుంటే పక్కనున్న బస్టాపులో జనం మధ్య వాడు పరిచయమున్నవాడిలా పళ్లికిలించి ముందుకెళ్లాడు.



"ఏంటీ ఇంకా మీ వూరెళ్లలేదూ" అడిగింది వసుంధర.

"నేదమ్మా నారీలిప్పుడే వస్తాయ్" అన్నాడు వాడు.

"లారీలెందుకూ? బస్సులున్నాయిగా"

"బస్సులున్నాయమ్మా. కానీ ఎర్రబస్సు టికటే ఎనిమిది- అదే నారీ అయితే ఐదుకే నాక్కుపోతాడు- కాపోతే ఓ ఫర్లాంగు దూరంలో ఆపేస్తాడు " అన్నాడు వాడు అతి మామూలుగా.

మూడు రూపాయలు మిగుల్తాయాని యిసక లారీల్లోనూ యిటుక, రాయి తెచ్చే లారీల్లోనూ ప్రయాణాలు చేస్తారు. కానీ ఆ ప్రయాణాల్లో తమ బతుకులు మిగుల్తాయా లేదా అని ఆలోచించరు. లారీ ప్రమాదాలూ, కూలిజనం మరణాల వార్తలూ లేని దినపత్రిక వుందా ఏ రోజైనా- అయితే వీళ్లకి తప్పదు వీళ్ల బతుక్కి మూడు రూపాయలకే మూడొందలు!

ఇటువంటి బీదా బిక్కీ ప్రజలకోసం, బడుగు వర్గాలకోసం ప్రభుత్వం వేసిన పాసింజర్ బస్సులన్నీ ఏమైపోతున్నట్లో? అసలు ఉన్నట్టా? లేనట్లా? స్ట్రైకులూ, ఇంజను రిపేర్లూ, టాక్సులూ, పెరిగిన డీజిలు ధరలూ, పెరిగిన సిబ్బంది జీతభత్యాలూ వాటితో పాటు పెరుగుతున్న టిక్కెట్టు ధరలూ.. వీటికంతెక్కడ?

"ఇంతకీ మీదే వూరన్నావ్ ?"

"ఆనందపురమమ్మా!"

ఆనందపురం! ఆకుకూరలమ్మేవాళ్లూ, అరటి పళ్లమ్మేవాళ్లూ, ముగ్గురాళ్లూ, చీపుర్లూ, తాటిముంజలు అమ్మేవాళ్లూ తెల్లార్లేచి ఎండనక, వాననక ప్రయాణించి పట్టణ ప్రజల్ని తమ సంపదలతో ఆదుకుంటున్న చిన్న వ్యాపారస్తుల ఆనందనిలయమైన వూరు కష్టజీవుల ఆనంద నిలయమేనా అది! చూడాలి వీళ్ల జీవితాల్లో ఎంత ఆనందముందో ఆ వూరెళ్లి చూడాలి!

"ఆనందపురం వెళ్లాలి!" అనుకొంది. ■

### ఐశ్‌కిద్దరు బాడీ గార్డులు

ఇటీవల కేన్స్ ఉత్సవానికి వెళ్లినప్పుడు విపరీతంగా నవ్వులు పంచేసి అందరినీ ఆకట్టుకుందిట ఈ బెంగాలీసుందరి. అందరూ ఆమెనే కళ్లప్పగించి చూడ్డానికి కారణం ఐశ్ ధరించిన వజ్రాల నగలట! ఆ నగలు చోరీ కాకుండా కంపెనీ వారు పంపిన బాడీ గార్డొకరైతే, రెండో గార్డు వివేక్ ఒబెరాయ్. ఐశ్‌ను అస్సలొదిలి పెట్టకుండా, సదా వెంటనంటే తిరిగాట్ట వివేక్. అందుకే అలాగన్నారు!